# చరిత్రకెక్కిన చరితార్థులు
## జగద్గురు శ్రీ భారతీకృష్ణతీర్థ

- శ్రీనివాసరావు అయినాపురపు.

అస్మద్గురుభ్యోనమ: ఎప్పుడో కృత యుగములో దేవతలు, రాక్షసులు క్షీరసాగరమును చిలికి అమృతము ఉద్భవించడానికి శ్రమపడ్డారు. కాని అందులో వారివారి స్వార్ధచింతన కనిపిస్తుంది. నిస్వార్ధముగా అధర్వణవేదమును పరిశోధనచేసి, మానవాళికి ఉపయోగపడేటట్లుగా వేదగణిత సూత్రములను వెలుగులోకి తెచ్చిన మహనీయులు, జగద్గురువులు, పూరిలోని గోవర్ధన మఠాధిపతులు, శ్రీ భారతీకృష్ణతీర్థమహరాజ్ గారిని గురించి, వారి కృషిని గురించి, వారు మనకు అందించిన అతి విలువైన సంపదను గురించి ఈ వ్యాసములో గుర్తుచేసుకుంటూ, ఆయన గురించి క్లుప్తముగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం!

మద్రాసు ప్రసిడెన్సీలో తిరునెళ్వేలి తహసిల్దారుగా పనిచేసిన నరసింహశాస్త్రిగారి తనయునిగా 1884 మార్చి నెలలో వెంకట్రామన్ శాస్త్రి జన్మించారు. తరువాత నరసింహశాస్త్రిగారు ప్రసిడెన్సీకి డిప్యూటి కలెక్టరుగా ఉన్నతిని పొందారు. వెంకట్రామన్‌గారి బంధువు శ్రీ చంద్రశేఖర శాస్త్రిగారు విజయనగరములోని మహరాజా కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసారు. వెంకట్రామన్‌గారి ముత్తాతగారు మద్రాసు హైకోర్ట్ జడ్జిగా ఉన్నతమైన పదవులను అలంకరించారు. అటువంటి కుటుంబములో పుట్టిన వెంకట్రామన్ సహజముగానే తెలివితేటలను పుణికిపుచ్చుకున్నారు. తిరుచునాపల్లిలోని నేషనల్ కళాశాలలో విద్యార్థిగా ప్రారంభించి, చర్చ్ మిషనరీ సొసైటీ కళాశాలలోనూ, హిందూ కళాశాలలోను విద్యను కొనసాగించి, మద్రాసు విశ్వవిద్యాలయమునుండి మెట్రిక్యులేషన్ పరీక్షయందు జనవరి 1899లో ఉత్తీర్ణత సాధించారు. అన్ని తరగతులలోనూ, అన్ని సబ్జెక్టులలోనూ మొదటి స్థానం సంపాదించేవారు. తెలివితేటలతోను, గ్రహణశక్తితోను, ఆశక్తితోను అందరిని ఆకట్టుకొనేవారు. కొన్ని సందర్భములలో ఆయన అడిగిన ప్రశ్నలకు సమాధానము తెలియక ఉపాధ్యాయులు తికమక పడేవారు.

వెంకట్రామన్ గణితము (Mathematics), శాస్త్రవిజ్ఞానము (Science), మానవీయశాస్త్రము (Humanities)లలో అత్యధిక మార్కులను సాధించడమేగాక, సంస్కృతములోనూ ప్రావీణ్యము సంపాదించారు. అతనికి 16 సంవత్సరముల ప్రాయములోనే మద్రాసు సంస్కృత సంఘం 1899 జులై లో "సరస్వతి" అనే బిరుదముతో సత్కరించింది. శ్రీ వేదం వెంకట్రాయ శాస్త్రిగారు ఆయనకు సంస్కృతముపై మక్కువ కలగడానికి ప్రోత్సహించిన గురువు. 1902లో ఆయన బి.ఎ. పరీక్షను, 1903లో ఎమ్.ఎ. పరీక్షను రోచెస్టర్, న్యూయార్క్ లోని 'అమెరికన్ కాలేజ్ ఆఫ్ సైన్సెస్' నుండి - బొంబాయి (నేటి ముంబయి) కేంద్రముగా ఉత్తీర్ణులైనారు. ఎమ్. ఎ. లో సంస్కృతము (Sanskrit), తత్వశాస్త్రము (Philosophy), ఆంగ్లము (English), గణితశాస్త్రము (Mathematics), చరిత్ర (History), శాస్త్రవిజ్ఞానము (Science) మొదలైన ఏడు విషయములను ఎన్నుకుని,

వాటిలో అత్యధిక మార్కులను సాధించి, ఆ రోజులలో ప్రపంచరికార్డు నమోదు చేసుకున్నంత ఘనతను సాధించారు. కళాశాలలో చదివేరోజులలోనే చరిత్ర (History), సామాజిక శాస్త్రము (Sociology), తత్వశాస్త్రము (Philosophy), రాజనీతిశాస్త్రము (Politics), సాహిత్యము (Literature)నకు సంబంధించిన అనేక వ్యాసములు వ్రాసినారు.

*భారతీ కృష్ణ తీర్థ స్వామీజీ మనకు అందించిన 16 సూత్రములను ఉపయోగించి అంకగణితము, బీజగణితము, త్రికోణమితి, సమతల జ్యామితి, గోళీయ జ్యామితి, అవకలన మరియు సమాకలన కలనగణితములకు సంబంధించిన సమస్యలను సులువుగా సాధించవచ్చును.*

వెంకట్రామన్ సరస్వతిగారు 1905వ సంవత్సరములో గోపాలకృష్ణ గోఖలేగారి ఆధ్వర్యములో రాష్ట్రవిద్యా ఉద్యమములోను, దక్షిణ ఆఫ్రికాలో నివసించే భారతీయుల సమస్యలను పరిష్కరించే ఉద్యమములోను పాల్గొన్నారు. కాని, శాస్త్రవిజ్ఞానము మరియు భారతీయులకు ఆరాధ్యగ్రంధములు, ఉపనిషత్తులను గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలనే తలంపు అతనిని ఆ దిశలో నడిచేందుకు ప్రోత్సహించింది. 1908 వ సంవత్సరములో మైసూరులోని శృంగేరి మఠములో శ్రీ సచ్చిదానంద శివాభినవ నృసింహ భారతి శంకరాచార్య స్వామి సమక్షంలో అధ్యయనము చేయడానికి అనుమతి పొందారు. కాని, రాజమహేంద్రవరములో ( నేటి రాజమండ్రిలో) క్రొత్తగా ప్రారంభించిన కళాశాలలో సేవలను అందించమని జాతీయనేతలు ఒత్తిడి చేసిన కారణముగా అతని ఆధ్యాత్మిక సాధనకు ఆటంకము కలిగింది. తరువాత ఆయన రాజమండ్రి కళాశాలలో మూడు సంవత్సరములు విద్యాబోధనచేసి, 1911 వ సంవత్సరములో కళాశాలను విడిచి, మరలా ఆధ్యాత్మిక సాధనకై సచ్చిదానంద శివాభినవ నృసింహ భారతి స్వామివారి సముఖమునకు వెళ్ళారు.



**జగద్గురు శంకరాచార్య శ్రీ భారతీ కృష్ణతీర్థగారు**

శృంగేరీపీఠమునకు వెళ్ళిన తరువాత నృసింహ భారతి స్వామివారి సన్నిధిలో ఎనిమిది సంవత్సరముల పాటు వేదాంత తత్వశాస్త్రమును అధ్యయనము చేసారు. ఈ సందర్భములో ఆయన ధ్యానయోగమును కూడా సాధనచేసారు. ఈ సమయములోనే ఆయన ఆధ్యాత్మికముగా ఆత్మ సాక్షాత్మారమును (Self realization) పొందారని పెద్దల విశ్వాసము. వారు శృంగేరిలో గడిపిన ఎనిమిది సంవత్సరములలో ప్రాంతీయ ఆశ్రమములలోను, పాఠశాలలలోను సంస్కృతము, తత్వశాస్త్రములను బోధించారు. శంకరాచార్య స్వామివారి తత్వమును గురించి పదహారు ప్రసంగాలు చేసారు. ముంబయి, పూనా మొదలైన చోట్ల వివిధ సంస్థలలో అతిథివక్తగా ప్రసంగించారు. తరువాత జులై 4 వ తేదీ 1919 వ సంవత్సరములో, కాశిలో శారదాపీఠాధిపతి, జగద్గురు శంకరాచార్య శ్రీ త్రివిక్రమ్ తీర్థ మహరాజ్ గారివద్ద సన్యాసాశ్రమమును స్వీకరించారు. ఈ సందర్భములో ఆయనను స్వామిగా గుర్తించి, భారతీ కృష్ణ తీర్థగా నామకరణము చేయడం జరిగింది.

అనంతరము 1921 వ సంవత్సరములో, సన్యాసాశ్రమమును గ్రహించిన రెండు సంవత్సరములలోనే, శంకరాచార్యగా, జగద్గురువుగా గుర్తించబడ్డారు. ఆ తరువాత ఆయన భారతదేశము నలుమూలలా పర్యటించి, సనాతనధర్మమును గురించి, వేదాంతమును గురించి, వేద తత్వశాస్త్రమును గురించి ఉపన్యాసములు ఇచ్చారు. అతని మేధాశక్తి, వక్తృత్వము, ఆకర్షణీయమైన వ్యక్తిత్వము, నిశ్చలతత్వము, ఔన్నత్యము, కార్యసాధనాతత్పరత అన్ని తరగతులవారిని ఆకట్టుకొనడమువలన, అతని ప్రసంగాలకు లౌకికులు, ఆధ్యాత్మిక ప్రవృత్తి కలిగినవారు కూడా హాజరయ్యేవారు.

శారదాపీఠమునకు శంకరాచార్య స్వామిగా ఉన్నప్పుడే, పూరి గోవర్ధన మఠమునకు శంకరాచార్యులు జగద్గురు శ్రీ మధుసూధన తీర్థ అనారోగ్యము కారణముగా, భారతీ కృష్ణగారిని తన తరువాత గోవర్ధన మఠమునకు ఆచార్యులుగా ఉండమని ఆహ్వానించగా, భారతీ కృష్ణగారు ఆయన ఆహ్వానాన్ని మృదువుగా తిరస్కరించారు. కాని 1925లో శంకరాచార్య శ్రీ మధుసూధన తీర్థగారి ఆరోగ్యము విషమించడంతో, తప్పనిసరి పరిస్థితులలో గోవర్ధనమఠమునకు శంకరాచార్యులుగా భారతీ కృష్ణతీర్థగారు అంగీకరించవలసి వచ్చింది. ఈ కారణముగా ఆయన శారదాపీఠమును త్యజించవలసివచ్చింది. శారదాపీఠమునకు శంకరాచార్యులుగా శ్రీ స్వరూపానందస్వామిని ప్రవేశపెట్టారు.

గోవర్ధనమఠము శంకరాచార్యగా ఆయన 35 సంవత్సరములు ప్రపంచ పర్యటనలలో శాంతి (Peace), సామరస్యము (Harmony), సౌభ్రాతృత్వము (Brotherhood) మొదలైన విలువలను గురించి, సనాతన ధర్మమును గురించి విశ్వవ్యాప్తముగా ప్రసంగములు చేసారు. ఈ సమయములో ఆయన ఆధ్యాత్మిక, శాస్త్రీయ, గణిత, సాంఘిక, విశ్వశాంతి మొదలైన విషయములతో వ్యాసములు, పుస్తకములను వ్రాయడం జరిగింది. 1953వ సంవత్సరములో ఆయన 'శ్రీ విశ్వ పునర్నిర్మాణ సంఘము' పేరుతో ఒక సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ కార్యవర్గము స్వామీజీ శిష్యులు, భక్తులు, ప్రోత్సాహకులు మరియు ఆధ్యాత్మిక సాధనచేసేవారు, సంఘ సంస్కరణలు చేసేవారు మొదలైనవారితో ఏర్పడింది. పరమహంస యోగానందగారిచే స్థాపించబడిన వేదాంత సొసైటీ వారి సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ ఆఫ్ లాస్ ఏంజల్స్‌ను పొంది, 1958 ఫిబ్రవరి నెలలో లాస్ ఏంజల్స్‌లో ప్రపంచశాంతిని గురించి, వేదాంతమును గురించి ప్రవచనములను ఇవ్వడం జరిగింది. ఈ పర్యటనలో ఆయన మూడు నెలలు ఉన్నారు. 1960 వ సంవత్సరములో ఆయన పరమపదమునందారు. 1965వ సంవత్సరములో ఆయన భక్తుడు, ప్రముఖ వ్యాపారవేత్త శ్రీ అరవింద్ ఎన్. మఫత్‌లాల్ 'వేదగణితము' పుస్తకము ప్రచురించడానికి ముందుకు రావడముతో, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయము వైస్ చాన్సలర్ శ్రీ ఎన్. హెచ్. భగవతి ఆధ్వర్యంలో 'వేదగణితము' (ఆంగ్లములో) ప్రచురించబడింది.

జగద్గురు శ్రీ భారతీ కృష్ణతీర్థగారి 'వేదగణితము' పుస్తకము గణితపద్ధతులను ఎంతో త్వరితగతిని చేసే పద్ధతులను వెలుగులోనికి తెచ్చాయి. దీనిలో సూత్రములను ఉపయోగించి, ఎన్నో క్లిష్టమైన సమస్యలను అతి సులువుగా, ఒక వరుసలో సాధించవచ్చు. ఉదాహరణకు 3 అంకెల సంఖ్యను మరో 3 అంకెల సంఖ్యతో

గుణిస్తున్నప్పుడు, సాధారణ పద్ధతిలో 4 వరుసలలో దాని ఫలితాన్ని కనుక్కుంటాము. వేదగణిత పద్ధతిలో దానినే ఒక వరుసలో సాధిస్తామన్నమాట. కొన్నివేల సంవత్సరములుగా ఈ సూత్రములు వేదములలోనున్నప్పటికీ, స్వామీజీ వాటిని తిరిగి కనుక్కునేవరకూ అవి అందుబాటులోకి రాలేదు.

పూర్వము వరాహమిహిరుడు, భాస్కరుడు మొదలైనవారు ఖగోళ పరిశోధనలలో వేదగణిత సూత్రములను ఉపయోగించి ఉంటారని మనము విశ్వసించవచ్చు. రామాయణకాలములోను, మహాభారతకాలములోను ఎన్నో రకములైన ఆయుధముల నిర్మాణములోను, కట్టడముల నిర్మాణములోను అధర్వణవేదపద్ధతులు ఉపయోగించారనడానికి ఎన్నో తార్కాణములు కనిపిస్తాయి. పూర్వకాలములో పెద్ద పెద్ద సంఖ్యలను అంకెలను వాడి వ్రాయకుండా, సంస్కృతపు అక్షరములను వాడి వ్రాసేవారు. వేద సూత్రములలో సమస్యాపరిష్కారములు క్లుప్తమైన పదములద్వారా గాని, చక్కని ప్రాసతో కూడిన పద్యరూపములో గాని పొందుపరచేవారు. దీనివలన సూత్రములు సుళువుగా గుర్తుండిపోతాయి. గుప్తంగా ఉంచడము పూర్వికుల ఉద్దేశ్యము కాదు. ఉదాహరణకు కృష్ణుని స్తుతిస్తున్నట్లు ఉండే ఒక శ్లోకము వేరొక విధముగా చూస్తే శంకరుని స్తుతిస్తున్నట్లుగా అనిపిస్తుంది. అదే శ్లోకము π విలువలో పదవ వంతునుకూడా తెలియజేస్తుంది, కాకపోతే ముందుగా అందులోనే పొందుపరచబడిన మూలమును గుర్తించాలి. స్వామీజీ మనకు అందించిన 16 సూత్రములను ఉపయోగించి అంకగణితము (Arithmetic), బీజగణితము (Algebra), త్రికోణమితి (Trigonometry), సమతల జ్యామితి (Plane Geometry), గోళీయ జ్యామితి (Spherical Geometry), అవకలన (Differential) మరియు సమాకలన (Integral) కలనగణితము (Calculus)లకు సంబంధించిన సమస్యలను సుళువుగా సాధించవచ్చును. ఆయన వేదగణిత సూత్రములను 16 సంపుటములుగా వ్రాస్తే, దురదృష్టవశాత్తూ ఆ వ్రాత ప్రతులు అగ్ని ప్రమాదములో కనుమరుగయ్యాయి. తరువాత భారతీ కృష్ణతీర్థగారు 1957లో తిరిగి ఆ 16 సంపుటముల సారాంశమును ఒక పుస్తకముగా కేవలము ఆరు వారములలో వ్రాసినారు.

***ఒక సంఖ్య వర్గమునకు సూత్రము:*** *'యావదూనం తావదూనీకృత్య వర్గం చ యోజయేత్' ఉపసూత్రమునను సరించి 92 యొక్క వర్గమును కనుగొనుట.*

92, 100 కన్నా 8 తక్కువ. ఇప్పుడు 92 నుండి 8 ని తీసివేసి, వందల మరియు వేల స్థానములో వ్రాసుకోవాలి (84--). 8 వర్గమును ఒకట్ల మరియు పదుల స్థానములో వ్రాసుకుంటే (8464), 92 వర్గము వచ్చినట్లే! కావున, $92^2 = 8464$.

***ఒక ఆధారమునకు దగ్గరగానున్న రెండు సంఖ్యల లబ్ధము:*** 'ఊర్ధ్వ తిర్యగ్భ్యామ్' సూత్రమునను సరించి 107, 112 ల లబ్ధమును కనుగొనుట.

107, 112లు 100 (ఆధారము) కన్నా వరుసగా 7, 12 హెచ్చు. ఇప్పుడు 12, 7 లను గుణించి, ఒకట్ల మరియు పదుల స్థానములో వ్రాసుకోవాలి (--84). తరువాత 107కు 12ను గాని లేదా 112కు 7ను గాని కలిపి, వందల, వేల మరియు పదివేల స్థానములలో వ్రాసుకుంటే (11984), లబ్ధము కనుగొన్నట్లే! కావున, 107 x 112 = 11984.




*ఈ సూత్రములలో కొన్నింటిని అక్టోబరు 2005 మొదలు అక్టోబరు 2006 వరకు సంఘమిత్రలోని మేధామాత్రకలు శీర్షికలో ప్రచురించడం జరిగింది. గమనించగలరు.*